# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు






ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 10 | బుధవారం 02 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


# తెలంగాణ హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు

- ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!
- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు



**హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం - మిగతా 2 లో



# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

- కొండా సురేఖపై అంశంపై చర్చ!
- తాజా రాజకీయ పరిణామాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశంపై చర్చిస్తున్నట్లు సమాచారం
- మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించే అవకాశం

**హైదరాబాద్ :**

ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరుగుతోంది. - మిగతా 2 లో

# కల్వకుంట్ల కవితకు వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్



- కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి
- కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా

**హైదరాబాద్ :**

కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని - మిగతా 2 లో

# భూమి నుంచి నేరుగా అంతరిక్షానికి లిఫ్ట్!

- త్వరలో నిజం కానుందా?
- స్పేస్ ఎలివేటర్ నిర్మాణంపై పరిశోధకుల పురోగతి
- 66 వేల మైళ్ల పొడవైన కేబుల్ ప్రతిపాదన
- కేబుల్‌కు పాలీక్రిస్టలైన్ గ్రాఫీన్‌ను పరిశీలిస్తున్న సైంటిస్టులు
- దక్షిణ కొరియాలో 1,000 మీటర్ల గ్రాఫీన్ తయారీ
- ప్రధాన సవాలుగా మారనున్న అంతరిక్ష వ్యర్థాలు

**ఢిల్లీ :**

అంతరిక్షంలోకి వెళ్లాలంటే ఇప్పటివరకు రాకెట్లే ప్రధాన మార్గం. కానీ భవిష్యత్తులో రాకెట్ల అవసరం లేకుండానే భూమి నుంచి నేరుగా అంతరిక్షానికి చేరుకునే అవకాశం ఉందా? శాస్త్రవేత్తలు ఈ ఆలోచనకు మరింత దగ్గరవుతున్నట్లు చెబుతున్నారు. దాదాపు 66 వేల మైళ్ల పొడవైన 'స్పేస్ ఎలివేటర్' నిర్మాణానికి - మిగతా 2 లో



# బంగారం కొనొద్దు స్వదేశీ వస్తువులే వాడండి



- దేశ ప్రజలకు మోదీ పిలుపు
- భారత్ జీడీపీలో 7.8 శాతం వృద్ధి
- స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న మోదీ
- విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ వద్దని పిలుపు
- అవసరం లేకపోతే బంగారం కొనొద్దని సూచన

**ఢిల్లీ :**

దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. స్వదేశీ వస్తువులు, సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అవసరం లేని విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దని చెప్పారు. అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. - మిగతా 2 లో

# పాక్ ప్రధాని ముందే ఉగ్రవాదంపై మోదీ కీలక వ్యాఖ్యలు..!

- ఎస్‌సీఓ వేదికగా ఉగ్రవాదంపై మోదీ ప్రసంగం
- ఉగ్రవాదానికి డబుల్ స్టాండర్డ్స్ ఉండకూడదని స్పష్టీకరణ
- టెర్రరిజాన్ని విధానంగా వాడే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని పిలుపు
- ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆయుధం కారాదని స్పష్టీకరణ
- పాక్ ప్రధాని షరీఫ్ సమక్షంలోనే మోదీ ఘాటు వ్యాఖ్యలు - మిగతా 2 లో

# 100 ఏళ్ల చరిత్ర ఉన్న హిందూ దేవాలయం పాకిస్థాన్‌లో కూల్చివేత

- పాకిస్థాన్‌లో వందేళ్ల నాటి హిందూ దేవాలయం కూల్చివేత
- మదర్సా విస్తరణ కోసమే ఈ చర్య అని మైనారిటీ సంఘం ఆరోపణ
- అధికారుల ఆదేశాలున్నా అమలు కాలేదని విమర్శలు
- ఆలయాన్ని పునర్నిర్మించాలని స్థానికులు,హక్కుల సంఘం డిమాండ్



**ఢిల్లీ :**

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో శతాబ్ద కాలం నాటి చరిత్ర కలిగిన ఒక హిందూ దేవాలయాన్ని కూల్చివేసిన - మిగతా 2 లో

# రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు




- రాష్ట్ర ఎన్నికల సంఘం
- రాష్ట్రంలో మొత్తం 13,278 గ్రామపంచాయతీలన్న ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా
- పోలింగ్ స్టేషన్ల అంశంలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తీసుకున్నామని వ్యాఖ్య

**అమరావతి :**

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నారు. మరోవైపు సమగ్ర ఓటర్ల నమోదు ప్రత్యేక జాబితా (సర్) ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ప్రతి పంచాయతీలో ఇంటింటా సర్వే పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కీలక పోలింగ్ - మిగతా 2 లో

## ప్రజానాడి




# బటన్ నొక్కడానికి రాలేదు పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం
- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి
- రెండేళ్లలో పింఛన్లకే రూ.73,500 కోట్లు, సంక్షేమానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు
- ఆడబిడ్డలకు త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం
- నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తన ఆశయమని స్పష్టీకరణ



**అమరావతి :**

"గత పాలకులు బటన్ నొక్కి చేతులు దులుపుకొన్నారు, రోడ్ల నిండా గుంతలు పెట్టారు. కానీ మేం అలా కాదు.. ప్రతి అవ్వాతాత ఇంటికి వచ్చి వారికి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికిందని చంద్రబాబు అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత పాలకుల తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాము నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పెంచిన పెన్షన్లను అందిస్తూ - మిగతా 2 లో

# సంపాదకీయం

## జోడీ కోసం.. వేలసార్లు పాట పాడి...!

ఒకప్పుడు హవాయిలోని కౌయై అడవుల్లో ఒక అందమైన, అరుదైన పక్షి జీవించేది. దాని పేరు కౌయై ఓఓ (ఖుఖుఖు 'హా'శీ). నల్లని శరీరం పసుపు రంగు ఈకలతో ప్రత్యేకమైన రూపం దానిది. అంతకంటే ప్రత్యేకమైనది దాని మధురమైన స్వరం. ఒకప్పుడు ఈ పక్షుల పాటలతో కౌయై అడవులు మారుమోగేవి. ఆ పాటలు ఆ అడవికి సహజ సంగీతంలా ఉండేవి. ఇప్పుడు ఆ పక్షి లేదు.. అంతరించిపోయింది. కౌయై ఓఓ పక్షి అంతరించిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మనుషుల కార్యకలాపాల వల్ల అడవులకు నష్టం జరిగి దాని సహజ ఆవాసాలు తగ్గిపోయాయి. ఆహారం, గూడు కట్టుకునే ప్రదేశాలు క్రమంగా తగ్గిపోయాయి. రెండో కారణం, మనుషులు హవాయికి తీసుకువచ్చిన ఎలుకలు, పిల్లులు వంటివి ఈ పక్షులను, వాటి గుడ్లను వేటాడాయి. మూడవది హవాయికి పరిచయం లేని దోమలు కొత్తవ్యాధులను వ్యాపింపజేశాయి. ముఖ్యంగా ఏవియన్ మలేరియా వంటివి స్థానిక పక్షుల సంఖ్యను తీవ్రంగా తగ్గించాయి. ఇవేకాకుండా ప్రకృతి వైపరీత్యాలు అడవులను, ఆహార వనరులను దెబ్బతీశాయి. దీనితో పక్షుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. పక్షులకు వాటి సంఖ్య తగ్గిపోవడంతో జోడీని కనుగొనడం, సంతానం పెంచుకోవడం మరింత కష్టమైంది. చివరికి మిగిలింది... ఒకే ఒక్క పక్షి. 1981లో ఒక మగ కౌయై ఓఓను పరిశోధకులు గుర్తించారు. అలా... ఒకప్పుడు వందలాది పక్షుల పాటలతో నిండిన ఆ అడవిలో, చివరికి ఒక మగ కౌయై ఓఓ మాత్రమే మిగిలింది.అది తన జోడీని ఆకర్షించేందుకు పాట పాడేది. ఒక్కసారి కాదు.. అనేక వేలసార్లు అడవిలోని చెట్ల మధ్య తన పాటను మళ్లీ మళ్లీ వినిపిస్తూ, మరో పక్షి స్పందన కోసం ఎదురుచూసేది. కానీ, అప్పటికే దాని జాతి అంతరించిపోయింది. ఆ విషయం ఈ ఒంటరి మగ పక్షికి తెలియదు. తన చుట్టూ వందలుగా వినిపించిన తన జాతి స్వరాలు ఇక ఎప్పటికీ వినిపించవని దానికి తెలియదు. తన కోసం ఎదురుచూసే ఆడ పక్షి ఇక ఈ భూమిమీద లేనేలేదని కూడా దానికి తెలియదు. అందుకే అది తనకు తెలిసిన ఒక్క పని నిరంతరం చేస్తూనే ఉండేది... పాడటం. తోడుకోసం... తన జీవిత భాగస్వామి కోసం... తన పాటకు స్పందించే మరో స్వరం కోసం... అలా పాడుతూనే ఉంది. రోజులు గడిచాయి, ఋతువులు మారాయి, ఆ పక్షి మాత్రం, ప్రతి రోజూ తన జాతికి చెందిన మరో పక్షి వస్తుందన్న ఆశతో అలా పాడుతూనే ఉండేది. ఒక పిలుపు... మరో పిలుపు కోసం. సమాధానం రాలేదు. ఎంత గట్టిగా పాడినా... ఎంతసేపు పాడినా... ఎంతకాలం ఎదురు చూసినా... సమాధానం మాత్రం నిశ్శబ్దమే. చివరికి మిగిలింది... తన జాతి అంతరించిపోయిందనే విషయం తెలియక, తన చివరి తోడుకోసం జీవితాంతం పాడిన ఆ ఒంటరి స్వరం మాత్రమే. కొన్ని పాటలకు శ్రోతలు ఉండరు. కొన్ని పిలుపులకు సమాధానాలు ఉండవు. మరి కొన్ని జీవుల కథ నిశ్శబ్దంలోనే ముగుస్తుంది.1987లో ఆ పక్షి స్వరాన్ని పరిశోధకులు రికార్డు చేశారు. వారు ఆ రికార్డింగ్‌ను అడవిలో ప్లే చేస్తూ తిరిగారు. ఎక్కడైనా మరో కౌయై ఓఓ కనిపిస్తుందేమో, స్పందిస్తుందేమో అని ఆశగా అనేక సంవత్సరాల పాటు వెతికారు. కానీ, వారికి వినిపించిన ఆ పక్షిపాట వారి రికార్డర్‌లోనిదే. అడవి నుంచి మాత్రం సమాధానం రాలేదు. ఈ పిలుపునకు స్పందించే మరో కౌయై ఓఓ ఈ ప్రపంచంలో ఇక లేదన్న వాస్తవం క్రమక్రమంగా పరిశోధకులకు స్పష్టమైంది. ఆ పాటకు సమాధానం ఇక ఎప్పటికీ రాకపోవచ్చని వారికి అర్థమైంది. ఇక చివరకు మిగిలింది నిశ్శబ్దమే. ఒకప్పుడు వందలాది పక్షుల పాటలతో నిండిన ఆ అడవి... ఒకే ఒక్క పక్షి స్వరాన్ని విని... చివరికి మౌనంగా నిలిచిపోయింది. అలా మనిషి చేసిన తప్పుకు మరో జాతి బలి అయిపోంది.ఈ పక్షి అంతరించిపోవడం వెనుక అడవుల నాశనం, ఆవాసాలు కోల్పోవడం, మనిషి ప్రవేశపెట్టిన జంతువులు, వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అనేక కారణాలు ఉన్నాయి. కానీ వీటి వెనుక ఉన్న ఒక పెద్ద సమస్యను కూడా మనం మర్చిపోకూడదు. మనిషి తన అవసరాలకు మించి ప్రకృతిపై చూపిన ఒత్తిడి, జోక్యం. అడవులు మనకు కావాలి, భూమి కావాలి, వనరులు కావాలి. కానీ అదే అడవి జీవనాధారంగా ఉన్న ప్రాణులకు జీవించే హక్కు ఉందని మనం మర్చిపోయాం. ఈ రోజు కౌయై ఓఓ లేదు. దాని పాట ఇక వినిపించదు. మిగిలింది కేవలం పుస్తకాలలో దాని పేరు, పరిశోధనా పత్రాల్లో దాని గురించిన కొన్ని పంక్తులు. రికార్డింగ్‌లో దాని పాట మనిషి చేసిన తప్పులకు ఎన్నటికీ చెరగని గుర్తు. ఒక జాతి నాశనం కావడం అంటే, ప్రకృతి చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని శాశ్వతంగా చెరిపివేయడం. అంతరించిపోవడం ఒక్కసారిగా జరగదు. అడవి కొంచెం కొంచెంగా తరుగుతుంది.. జంతువులు క్రమక్రమంగా తగ్గుతాయి... వాటి గొంతులు ఒక్కొక్కటిగా నిశ్శబ్దమవుతాయి. చివరికి మిగిలేది-- 'ఒకప్పుడు ఇక్కడ ఒక పక్షి ఉండేది...'. ఒక జాతి అంతరించిపోయిన తర్వాత, మన దగ్గర ఎంత డబ్బు ఉండి ఏమి ప్రయోజనం? దాన్ని తిరిగి తీసుకురాలేం. ప్రకృతిని కోల్పోయిన తర్వాత సంపదతో దాన్ని కొనలేం. కౌయై ఓఓ వదిలి వెళ్లిన సందేశం ఒక్కటే-- మనిషి దురాశకు హద్దు లేకపోతే.. ఒక రోజు ప్రకృతిలో చివరకు మిగిలేది నిశ్శబ్దమే..!

## రెండు రోజుల్లో 'తల్లికి వందనం' పథకం నిధుల విడుదల

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది.వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను స్వీకరిస్తున్నారు. ఈ జాబితాల పరిశీలన పూర్తయిన వెంటనే ఆర్థిక శాఖ నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయనుంది.ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. గతంలో అర్హత ఉండి కూడా వివిధ కారణాలతో నిధులు అందని వారికి సైతం ఈ దఫాలోనే నగదు జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బంగారం కొనొద్దు.. స్వదేశీ వస్తువులే వాడండి

మొదటిపేజీ తరువాయి - కిర్గిజిస్థాన్ నుంచి మంగళవారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విడుదల చేసిన వీడియోలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం పెరిగిందని సోమవారం విడుదలైన గణాంకాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఉన్నా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు."విదేశీ దేశాలకు పర్యటనల కోసం వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దు. 'వెడ్ ఇన్ ఇండియా' నినాదాన్ని పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు" అని మోదీ సూచించారు.స్వదేశీ వస్తువులు, సేవలను ఎక్కువగా ఉపయోగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని చెప్పారు. భారత్ స్వావలంబన సాధిస్తే స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్ల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఈ ఏడాది మేలోనూ మోదీ ప్రజలకు పలు సూచనలు చేశారు. అవసరమైన చోట 'వర్క్ ఫ్రమ్ హోమ్', ప్రజా రవాణా వినియోగం పెంచాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని సూచించారు.

## ఉగ్రవాదంపై మోదీ పాక్ ప్రధాని ముందే కీలక వ్యాఖ్యలు..!

మొదటిపేజీ తరువాయి - ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని విధానంగా ఉపయోగించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని అన్నారు. ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆయుధం కారాదని తేల్చి చెప్పారు. కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్‌లో మంగళవారం జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రౌండ్‌టేబుల్ చర్చలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సమావేశానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా పలువురు దేశాధినేతలు హాజరయ్యారు.ఉగ్రవాదం విషయంలో ఎలాంటి ద్వంద్వ వైఖరికి అవకాశం ఉండకూడదని మోదీ అన్నారు. ఈ తీవ్రమైన అంశంపై అన్ని దేశాలు ఒకే గొంతుతో మాట్లాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని తమ విధానంలో భాగంగా ఉపయోగించే దేశాలతో పాటు ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు కూడా గట్టి సందేశం ఇవ్వాలని అన్నారు.అంతకుముందు ఎస్‌సీఓ నేతలు అధికారిక గ్రూప్ ఫొటోకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కొద్దిసేపు మాట్లాడారు. రెండు రోజుల సదస్సు సందర్భంగా మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. అయితే షీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.26వ ఎస్‌సీఓ సదస్సులో 10 సభ్య దేశాలతో పాటు 15 భాగస్వామ్య దేశాలు, రెండు పరిశీలక దేశాలు పాల్గొంటున్నాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తున్నారు.

## తెలంగాణ హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు

మొదటిపేజీ తరువాయి - తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి.ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్?లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

# బటన్ నొక్కడానికి రాలేదు - పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

మొదటిపేజీ తరువాయి - వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, 31 ఏళ్ల క్రితం ఇదే రోజు (సెప్టెంబరు 1) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశానని, అప్పటి నుంచి ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇప్పటివరకు పెన్షన్ల రూపంలో రూ.73,507 కోట్లు అందించామని, గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

### మహిళా సాధికారత నుంచి సామాజిక న్యాయం వరకు

మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు అన్నారు. పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా నిలబెట్టామని, ఇప్పుడు 'దీపం-2.0' పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్‌ఎంఈలుగా ఎదిగారని, ఈ లక్ష్యాన్ని మరింత పెంచుతామని, వారు తయారు చేసే ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండ్‌తో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 'స్త్రీశక్తి' కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి వారిపై ఆర్థిక భారం తగ్గించామని అన్నారు.సంక్షేమం అంటే కేవలం డబ్బులు పంచడం కాదని, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడమేనని సీఎం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లో ఇంకా ఉన్న వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి సామాజిక న్యాయం చేశామని గుర్తుచేశారు.

### అభివృద్ధి, సాంకేతికతతో నవశకం

నదుల అనుసంధానంతో రాష్ట్రంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని, శ్రీశైలం నుంచి మార్కాపురం వరకు నీళ్లు పారించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని, గోదావరి నీటిని అనకాపల్లి, విశాఖ మీదుగా వంశధార వరకు తీసుకెళ్తామని ప్రకటించారు.గత పాలకులు పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని, విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ 'ట్రూ డౌన్' ద్వారా ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.5కే అందిస్తున్నామని, ప్రపంచ మార్కెట్లో ఏపీ ఆక్వా ఉత్పత్తులను అగ్రస్థానంలో నిలుపుతామని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తామని, ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడించారు. నర్సాపురం అభివృద్ధికి ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు, డెల్టా ఆధునికీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

### ఏకగ్రీవాలు వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనం

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమిదే విజయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏకగ్రీవాలను వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనమని, గతంలో ప్రభుత్వాలే ఏకగ్రీవాలను ప్రోత్సహించాయని గుర్తుచేశారు.మేయర్, చైర్మన్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో పెట్టామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించి ఆ వర్గాలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామా నాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు




మొదటిపేజీ తరువాయి - కేంద్రాల జాబితా తయారీని పూర్తి చేశారు. గరిష్ఠంగా 650 మంది ఓటర్లను మించకుండా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఈ మేరకు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియను వివిధ జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. ఏపీలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్టు ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. మొత్తం గ్రామపంచాయతీలు 13,278 ఉన్నాయని వివరించారు. అందులో వార్డులు 1,33,128 ఉన్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలలోనూ సమగ్రంగా జిల్లా కలెక్టర్లు పోలింగ్ స్టేషన్లు నిర్ణయించారని చెప్పారు. వీటిపై జిల్లాలో అన్ని స్థాయిల్లో ఆగస్టు 23 నుంచి 26 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తీసుకున్నారని, తుదిగా ఈ సంఖ్య నిర్ణయించినట్టు అనిల్‌చంద్ర పునేఠా పేర్కొన్నారు. మరోవైపు 61 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ మొదలైంది. సెప్టెంబర్ 3న తుది జాబితాలు ప్రకటిస్తారు. రిజర్వేషన్లు ప్రకటించేందుకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ, బీసీల వివరాలను వాటిలో నుంచి గుర్తించనున్నారు. అదేవిధంగా డివిజన్లు, వార్డుల పునర్విభజనపై హైకోర్టులో తాజాగా వేసిన కేసులు, వైఎస్సార్సీపీ సర్కార్‌లో పంచాయతీలను నగర పంచాయతీలుగా ఉన్నతీకరిం చడం, పంచాయతీలు సమీప పుర, నగరపాలక సంస్థల్లో విలీనానికి వ్యతిరేకంగా వేసిన కేసులు కొలిక్కి వచ్చాక మరో 62 నగరాలు, పట్టణాల్లోనూ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తారు.స్థానిక సంస్థల ఎన్నికలకు అదనంగా 1.50 లక్షల బ్యాలట్ బాక్సుల కోసం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50వేలకు పైగా బ్యాలట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకే నెలలో స్థానికసంస్థలకు వరుసగా ఎన్నికలు నిర్వహించాలంటే 2 లక్షల వరకు బాక్సులు అవసరమని అంచనా.పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో మొదట ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి సెప్టెంబర్ రెండోవారంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు కలెక్టర్ల ద్వారా గెజిట్ నోటిఫికేషన్లు అందించాలన్న యోచనతో ఉన్నట్లు తెలిసింది. అనంతరం ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. రెండోదశలో పరిషత్ ఎన్నికలు, మూడోదశలో పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం.

# 100 ఏళ్ల చరిత్ర ఉన్న హిందూ దేవాలయం పాకిస్థాన్‌లో కూల్చివేత

మొదటిపేజీ తరువాయి -

ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. నరోవల్ నగరం పరిధిలోని సిరాజ్ గ్రామంలో ఆగస్టు 21న ఈ సంఘటన చోటుచేసుకుంది. సమీపంలోని ఒక ఇస్లామిక్ సెమినరీ (మదర్సా) విస్తరణ కోసమే ఈ ఆలయాన్ని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని మైనారిటీ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి.పాకిస్థాన్ మసీహా మిల్లత్ పార్టీ (పీఎంఎంపీ) ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. కొందరు వ్యక్తుల పథకం ప్రకారం ఈ ఆలయ నిర్మాణాన్ని కూల్చివేశారని ఆ పార్టీ చైర్మన్ అస్లాం పర్వేజ్ సహోత్రా ఆరోపించారు. గతంలో ఆలయం సమీపంలోని భూమిని ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్ (ఈటీపీబీ) సదరు మదర్సాకు లీజుకు ఇచ్చింది. అయితే, అద్దె చెల్లించకపోవడంతో ఆ లీజును రద్దు చేశారు. అయినప్పటికీ, ఆలయ స్థలంలోని కొంత భాగాన్ని కొందరు ఆక్రమించుకున్నట్లు సమాచారం.ఈ ఏడాది జనవరిలోనే ఆక్రమణదారులను ఖాళీ చేయించి, సదరు ఆస్తిని సీల్ చేయాలని ఈటీపీబీ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవి అమలు కాలేదని పీఎంఎంపీ విమర్శించింది. ఈ ఘటనపై ఆగస్టు 28న స్థానికులతో కలిసి పంజాబ్ అదనపు హోమ్ సెక్రటరీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆలయ కూల్చివేతకు బాధ్యులైన వారిపై, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ధ్వంసం చేసిన ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించాలని, దేశంలోని దేవాలయాలు, గురుద్వారాలు, చర్చిలకు సరైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఇటీవల జూన్ నెలలో ఫరూఖాబాద్‌లోని 125 ఏళ్ల పురాతన గురుద్వారాను కూడా ఇదే తరహాలో కూల్చివేసిన ఘటనను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. ఈ వరుస పరిణామాలతో పాకిస్థాన్‌లో మైనారిటీల ప్రార్థనా స్థలాల పరిరక్షణపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## భూమి నుంచి నేరుగా అంతరిక్షానికి లిఫ్ట్!

మొదటిపేజీ తరువాయి - అవసరమైన అత్యంత బలమైన పదార్థం విషయంలో పురోగతి సాధించినట్లు పరిశోధకులు చెబుతున్నారు.స్పేస్ ఎలివేటర్ నిర్మాణం కోసం భూమధ్యరేఖ సమీపంలో ఓ భారీ కేబుల్‌ను ఏర్పాటు చేస్తారు. అది భూమి నుంచి భూస్థిర కక్ష్యను దాటి అంతరిక్షంలోకి విస్తరిస్తుంది. చివర్లో ఉండే కౌంటర్‌వెయిట్ కారణంగా కేబుల్ గట్టిగా ఉంటుంది. ప్రత్యేక వాహనాలు ఈ కేబుల్‌పై పైకి ప్రయాణిస్తాయి. వాటి ద్వారా మనుషులు, సరకు, పరికరాలను అంతరిక్షానికి తరలించవచ్చు.ఉక్కు కంటే దాదాపు 100 రెట్లు బలంగా ఉండటంతో పాటు చాలా తేలికగా ఉండే పదార్థం అవసరం. భారీ స్థాయిలో ఉత్పత్తి చేయగలగాలి. ఈ అవసరాలకు 'పాలీక్రిస్టలైన్ గ్రాఫీన్' సరైన పదార్థంగా మారొచ్చని ఇంటర్నేషనల్ స్పేస్ ఎలివేటర్ కన్సార్టియం భావిస్తోంది.గ్రాఫీన్ కార్బన్ అణువులతో ఏర్పడిన అత్యంత పలుచని నిర్మాణం. దాని పాలీక్రిస్టలైన్ రూపాన్ని పెద్ద స్థాయిలో తయారు చేయడం సులభమయ్యే అవకాశం ఉంది. దక్షిణ కొరియాలో ఇంజినీర్లు ఇప్పటికే సుమారు 1,000 మీటర్ల పొడవు, అర మీటరు వెడల్పు ఉన్న పాలీక్రిస్టలైన్ గ్రాఫీన్ నిర్మాణాన్ని తయారు చేసినట్లు ఐఎస్ఈసీ తెలిపింది.అయితే అంతరిక్ష వ్యర్థాలు మరో పెద్ద ముప్పుగా ఉన్నాయి. ఉపగ్రహాలు, ఇతర వస్తువులు కేబుల్‌ను ఢీకొంటే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉంది. అందుకే ఒకదానికొకటి రక్షణగా పలు కేబుళ్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటి చుట్టూ ప్రత్యేక భద్రతా ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని శాస్త్ర వేత్తలు ప్రతిపాదిస్తున్నారు.ఈ ఎలివేటర్ అందుబాటులోకి వస్తే అంతరిక్ష ప్రయాణ ఖర్చులు భారీగా తగ్గే అవకాశం ఉంది. భూస్థిర కక్ష్య వరకు చేరేందుకు సుమారు రెండు వారాలు పట్టొచ్చని అంచనా. అక్కడి నుంచి సరుకును గంటకు దాదాపు 16 వేల మైళ్ల వేగంతో అంతరిక్షంలోకి పంపవచ్చు. చంద్రుడిని 14 గంటల్లో చేరే అవకాశం ఉండొచ్చని ఐఎస్ఈసీ అంచనా వేస్తోంది.అయితే ఇది ఇప్పటికీ పరిశోధన దశ లోనే ఉంది. నిర్మాణం ప్రారంభించినా పూర్తయ్యేందుకు దశాబ్దం నుంచి రెండు దశాబ్దాలు పట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక సవాళ్లతో పాటు భారీ పెట్టుబడులు అవసరం కావడం మరో సమస్య. అయినా ఈ ఆలోచన నిజమైతే అంతరిక్ష ప్రయాణంలో ఇది ఒక విప్లవాత్మక మార్పుగా నిలిచే అవకాశం ఉంది.

## కల్వకుంట్ల కవితకు వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్

మొదటిపేజీ తరువాయి - తాను ఎప్పుడూ కేసీఆర్-కవితలను కలపడానికే ప్రయత్నించాను తప్ప విడగొట్టడానికి కాదని స్పష్టం చేశారు.తాను, తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందే కేసీఆర్ వెంటే ఉన్నామని, తాము టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యులమని గుర్తుచేశారు. "బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్" అని పేర్కొన్న ఆయన... కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ లైన్ దాటినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ లోపలా బయటా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరంతరం పోరాడుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి మంతనాలు జరపలేదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రమాణపూర్వకంగా చెప్పగలనని... మరి కాంగ్రెస్‌తో కవిత రహస్య మంతనాలు జరపలేదని ఆమె చెప్పగలరా? అని నిలదీశారు.కేసీఆర్‌కు అత్యంత ఆప్తులుగా, బలంగా ఉన్న నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తూ... పార్టీని బలహీనపరిచి పరోక్షంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కవిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సభలో ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం కేవలం రాజకీయం కోసం, సానుభూతిని పొందేందుకేనని విమర్శించారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీని చేయడంలో తన పాత్ర ఏంటో కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసని, నిన్నటి వరకు ఆమెపై ఉన్న గౌరవాన్ని తన వ్యాఖ్యలతో కవిత స్వయంగా పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



మొదటిపేజీ తరువాయి - తాజా రాజకీయ పరిణామాలపై కేసీ వేణుగోపాల్‌తో సీఎం చర్చిస్తున్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశంపై చర్చిస్తున్నట్లు సమాచారం. మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించే అవకాశం ఉంది.మరోవైపు ఇవాళ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అధిష్ఠానం దిల్లీకి పిలిచడంతో ఆమె హుటాహుటిన కొండా సురేఖ దిల్లీ వెళ్లారు. తెలంగాణ కాంగ్రెస్ అగ్రనేతలు సైతం దిల్లీకి చేరుకున్నారు. ఇవాళ రాత్రి లేదా రేపు ఉదయం దిల్లీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెళ్లనున్నారు.

# అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

### రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత

### సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ

### ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు.ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు.కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్



మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రజా మంటలు
బుధవారం 02 - 09 - 2026

# వైకుంఠ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ సీనియర్ మంత్రి గోడిసెల రాజేశం గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 1: (ప్రజా మంటలు):** హైదరాబాద్ నాంపల్లిలోని రామ్ ప్రతాప్ పిట్టి భవన్‌లో ఉన్న లక్ష్మీనారాయణ స్వామి బాలాజీ మందిరంలో ప్రముఖ వ్యాపారవేత్త ప్రమోద్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి 30 వరకు నిర్వహించిన వైకుంఠ ఉత్సవాల్లో మాజీ సీనియర్ మంత్రి, మాజీ తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గోడిసెల రాజేశం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని తమిళనాడుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ తోతాద్రి రామానుజ జీయర్ స్వామీజీ ఆశీస్సులు పొందారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మినేని వికాస్ కూడా హాజరై స్వామీజీ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గోడిసెల రాజేశం గౌడ్ మాట్లాడుతూ, మన సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడంలో ఇటువంటి ఉత్సవాలు ఎంతో ముఖ్యమైనవని అన్నారు. ప్రజల్లో భక్తిభావంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. శ్రీ తోతాద్రి రామానుజ జీయర్ స్వామీజీ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గోడిసెల రాజేశం గౌడ్ ఆకాంక్షించారు.

# క్యాన్సర్‌పై ముందస్తు అవగాహన అవసరం-జూనియర్ సివిల్‌జడ్జి మాధవి



**మెట్పల్లి, సెప్టెంబర్ 1: ప్రజా మంటలు :** క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెట్పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి సూచించారు. మంగళవారం మెట్పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవాది చాప కిషోర్ సంతాప సభలో ఆమె పాల్గొని, కిషోర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాధవి మాట్లాడుతూ, క్యాన్సర్‌తో న్యాయవాది మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కోసం పోరాడటం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలని అన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించి కిషోర్‌కు నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా సోమవారం, మంగళవారం న్యాయవాదులు విధులకు దూరంగా ఉన్నారు. కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి దయ్యా రాజారాంలి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

## గాంధీ ఆస్పత్రి లో టీఎన్జీవోల డిమాండ్



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 01(ప్రజా మంటలు):** సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వెంటనే పునరుద్ధరించాలని టీఎన్జీవో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎన్జీవో కేంద్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం గాంధీ ఆసుపత్రి టీఎన్జీవో యూనిట్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన పూర్తి హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త పీఆర్సీని వర్తింపజేయాలని వారు నినదించారు. ఈ సందర్భంగా సమస్యల సాధనకై ప్లకార్డులతో నిరసన తెలిపిన ఉద్యోగులు, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భోజన విరామ నిరసన కార్యక్రమంలో కూడ పాల్గొన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ ప్రసన్నానంద్, నాయకులు సత్యనారాయణ, నాగబ్రహ్మం, శ్రవణ్, మక్బూద్, సరళ, సంగీత, సోనియా,మానస, సరిత, సౌమ్య, రహీమ్, రహమత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 17న సామూహిక సెలవుకు సిద్ధం కావాలి




**జగిత్యాల, సెప్టెంబర్ 1: ప్రజా మంటలు :** సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్ కుమార్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి, మధ్యాహ్న విరామ సమయంలో నిరసనలు చేపట్టారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సీపీఎస్ రద్దు--పాత పెన్షన్ పునరుద్ధరణ హామీని వెంటనే అమలు చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ కోరారు. మేనిఫెస్టో ప్రకటించిన నవంబర్ 17ను 'మేనిఫెస్టో డే'గా పాటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వ సతీష్ పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు ఉద్యమంలో భాగస్వామి కావాలని జిల్లా కోశాధికారి గొల్లపల్లి మహేష్ గౌడ్ కోరారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12 లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం:సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్



**మెట్‌పల్లి, సెప్టెంబర్ 01 (ప్రజా మంటలు):** సెప్టెంబర్ 12న నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ కోరారు. మంగళవారం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పోలీసులు, మీడియేషన్ కోఆర్డినేటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఆర్. అజయ్ కుమార్ మాట్లాడుతూ, గత లోక్ అదాలత్‌కు పోలీసులు, న్యాయవాదులు అందించిన సహకారం అభినందనీయమన్నారు. అదే విధంగా ఈసారి కూడా సమన్వయంతో పనిచేసి భారీ సంఖ్యలో కేసులను డిస్పోజ్ చేయడానికి సహకరించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల అంగీకారంతో కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్యా రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ఎస్సైలు కిరణ్ కుమార్, నవీన్ కుమార్, అనిల్ కుమార్, సందీప్ రావు, మీడియేషన్ కోఆర్డినేటర్లు ఓజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, పసునూరి శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యులు జేడి సుధాకర్, రిటెయినర్ లాయర్లు పుప్పాల భానుమర్తి, తోగిటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 01:** శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్ధిదంగా డి.జే వినియోగించరాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు.

# బుగ్గారం తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్‌కు జాతీయ అవార్డు

**బుగ్గారం, సెప్టెంబర్ 1: ప్రజా మంటలు :** బుగ్గారం మండల తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ 39 ఏళ్లకు పైగా అందించిన విశిష్ట సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ ఆయనను బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది. అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఎంపిక పత్రాన్ని జారీ చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజాగౌడ్ చేతుల మీదుగా అకాడమీ నేషనల్ అవార్డుల సెలెక్షన్ కమిటీ సభ్యులు చుక్క గంగారెడ్డి ఎంపిక పత్రాన్ని నరేందుల భూమేశ్వర్‌కు అందజేశారు. 1987లో ఉద్యోగంలో చేరిన భూమేశ్వర్ 25 ప్రాంతాల్లో వివిధ హోదాల్లో అందించిన సేవలు, సత్ప్రవర్తన, సమయస్ఫూర్తి, ప్రజలు--రైతుల నుంచి పొందిన మన్ననలు, ఉన్నతాధికారుల ప్రశంసలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు చుక్క గంగారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 5న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 19వ జాతీయ సదస్సులో నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా నరేందుల భూమేశ్వర్‌కు అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. కాగా, నరేందుల భూమేశ్వర్ పదవీ విరమణ మహోత్సవాన్ని కూడా జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్. లత, బి. రాజాగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి దేవిప్రసాద్, కలెక్టరేట్ ఏ.ఓ. ఇట్టియాల వెంకట కిషన్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్, ఫార్మర్ ఏ.ఓ. పుప్పాల హనుమంతరావు, ముద్దం తిరుపతి పాల్గొన్నారు. అలాగే వివిధ మండలాల తహసీల్దార్లు అబ్దుల్ మాజిద్, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్లు మండలోజు రాకేష్, సురేందర్ రావు, రాజేష్ యాదవ్, రమేష్, భూమేష్, జి.పి.ఓలు, బి.ఎల్.ఓలు, రేషన్ డీలర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, భూమేశ్వర్--వసంత అభిమానులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమేశ్వర్--వసంత సేవలను కొనియాడి జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.



జాతీయ అవార్డ్ కు ఎంపికైన బుగ్గారం తహసీల్దార్ " నరేందుల భూమేశ్వర్"



ఇద్దరు అదనపు కలెక్టర్ ల చేతుల మీదుగా బుగ్గారం తహసీల్దార్ కు జాతీయ అవార్డ్ ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న "చుక్క గంగారెడ్డి"
- బహుజన సాహిత్య అకాడమీ

# నంది ఎవరో...? పంది ఎవరో.....??' నీ వెయ్యి రోజుల పాలనే తేల్చింది

## కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు మానుకొండి

## హామీల అమలుపై దృష్టి పెట్టాలి:

## - దావ వసంత సురేష్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 01:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైకు దొరికిన ప్రతిసారీ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు, దూషణలకు దిగడం సరికాదని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి చేసిన 'నంది ఎవరో.. పంది ఎవరో' వ్యాఖ్యలకు సమాధానం ఆయన వెయ్యి రోజుల పాలనే తేటతెల్లం చేసిందని విమర్శించారు. మీడియా సమావేశంలో దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు, రేవంత్ రెడ్డికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని, తెలంగాణ రాష్ట్ర సాధనలో రేవంత్ రెడ్డి పాత్ర ఏమిటో ప్రజలకు తెలుసని అన్నారు. రేవంత్ రెడ్డి వెయ్యి జన్మలెత్తినా కేసీఆర్‌తో సరితూగలేరని దావ వసంత సురేష్ వ్యాఖ్యానించారు. పాలన ఎలా మెరుగుపరచాలనే దానిపై దృష్టి పెట్టకుండా, మైకు దొరికిన ప్రతిసారీ కేసీఆర్ కుటుంబాన్ని తిట్టడం, వ్యక్తిగత విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని అన్నారు. "వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు గడిచినా హామీలు అమలు చేయలేదు. నువ్వు నందివో.. పందివో నీ వెయ్యి రోజుల పాలనే తేల్చింది" అని దావ వసంత సురేష్ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు గౌరవిస్తారని, ఆయనను నందీశ్వరుడిగా, తెలంగాణ జాతిపితగా భావిస్తున్నారని అన్నారు. కేసీఆర్‌పై నోరు పారేసుకోవడం సులభమే కానీ, ఆయన తరహాలో ప్రజా పాలన అందించడం రేవంత్ రెడ్డి వల్ల కాదని విమర్శించారు. చిల్లర, బూతు మాటలు మాట్లాడటం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. "సూర్యుడిపై ఉమ్మితే అది తిరిగి మనపైనే పడుతుంది.. సూర్యుడి తేజస్సు మాత్రం తగ్గదు" అని అన్నారు. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం పాలనపై దృష్టి సారించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏ ఊరికి, ఏ పల్లెకు వెళ్లినా ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాలని కోరుకుంటున్నారని దావ వసంత సురేష్ అన్నారు. రేవంత్ రెడ్డి లాంటి చిల్లర, బూతు మాటలు మాట్లాడే నాయకత్వం తమకు వద్దని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పేర్కొంటూ, కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని దావ వసంత సురేష్ తెలిపారు.




# తెలుగు భాషా ఫోరం జగిత్యాల



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) సెప్టెంబర్ 01:** జగిత్యాల జిల్లా భాషోపాధ్యాయులు మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషకు ఆయుపట్టు పద్యం, తెలుగు భాషా సొగసుకు శిఖరాగ్రమైన ప్రక్రియ పద్య సాహిత్యం పై అనే అంశాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా విద్యాధికారి కె.రాము అనుమతి తీసుకుని, తెలుగు భాషా ఫోరం లెటర్ ప్యాడ్ ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. జిల్లా పద్య పాఠన పోటీకి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారిని హాజరుకావాలని ఉపాధ్యాయులు కోరారు. దానికి స్పందించిన ఆయన హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు పద్యంపై మక్కువ పెంచడానికి, పద్యం విశిష్టతను, రసానుభూతిని తెలియజేయుటకై తెలుగు భాషా ఫోరం జగిత్యాల వారు పద్యపఠన పోటీలు నిర్వహించనున్నారు. 6, 7 తరగతులు జూనియర్స్, 8, 9, 10 తరగతులు సీనియర్స్ విభాగాలలో సెప్టెంబర్ 2వ తేది మండల స్థాయి, సెప్టెంబర్ 8వ తేది జిల్లా స్థాయిలో డిసీఈబి జగిత్యాలలో నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలుగు భాషా ఫోరం అధ్యక్షులు బి.శేషగిరి, కార్యదర్శులు డా.ముత్యంపేట గంగాధర్, కార్యవర్గ సభ్యులు, మనోహరాచారి, సూర్యనారాయణ, సత్యనారాయణ, శివప్రసాద్ , వేణుగోపాల్ , చంద్రశేఖర్ తెలియజేశారు.

# బీజేపీ సీనియర్ల రహస్య సమావేశానికి బహిరంగ సమాధానం?



**జగిత్యాల, సెప్టెంబర్ 1 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లాలోని ఓ ఫామ్‌హౌస్‌లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై పలువురు బీజేపీ సీనియర్ నాయకులు ఆరోపణలు చేస్తూ రహస్య సమావేశం నిర్వహించిన విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. ఈ పరిణామానికి ప్రతిగా ఎంపీ అరవింద్‌కు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున సమీకరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 500 కార్లతో హైదరాబాద్‌కు తరలివెళ్లి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి సీనియర్ నాయకులపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, జగిత్యాల నియోజకవర్గం నుంచి సుమారు 60 కార్లలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు రామచందర్ రావును కలిసి ఎంపీ అరవింద్‌పై సీనియర్లు చేసిన ఆరోపణలను ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు పరిణామాలు బీజేపీలో నెలకొన్న అంతర్గత విభేదాలను మరింత బహిర్గతం చేస్తున్నాయనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. సీనియర్ల సమావేశానికి ప్రతిగా భారీగా కార్యకర్తలను సమీకరించి రాష్ట్ర అధ్యక్షుడిని కలవడం ద్వారా తమ బలాన్ని చాటుకునే ప్రయత్నం జరుగుతోందా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఈ వివాదాన్ని ఏ విధంగా పరిష్కరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# పేదల పక్షపాతిగా వెయ్యి రోజుల పాలన

## జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజాపాలన సంబరాలు..



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 01:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయం మోతే రోడ్డు లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య ఆధ్వర్యంలో వెయ్యి రోజుల ప్రజా పాలన సంబరాలు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి జగిత్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కుటుంబ సభ్యులకు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మున్సిపల్ చైర్మెన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,మార్కెట్ కమిటి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్ ,అడువాల జ్యోతి లక్ష్మణ్ , ఎన్.ఆర్.ఐ. సెల్ చాంద్ పాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మన్సూర్,జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్ ,ఎస్సీ,ఎస్టీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్ సురేందర్ నాయక్, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ లు దామోదర్ రావు నక్కల రవీందర్ రెడ్డి , పట్టణ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, బాల ముకుందం , సీనియర్ నాయకులు గట్టు సతీష్,తాటిపర్తి శరత్ రెడ్డి, డీలర్ రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు సర్పంచులు ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఫైనాన్స్ లో ఇరుక్కున్న ఇల్లు

## వేలం వేస్తారన్న భయంతో యువకుడి ఆత్మహత్య





**ధర్మపురి ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 01:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ముదిరాజ్ కాలనీలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ ఇబ్బందులతో ఉరివేసుకొని పంబాల మహేష్ అనే యువకుడి ఆత్మహత్య చేసుకున్నారు. గతంలో ప్రైవేట్ ఫైనాన్స్ లో హోమ్ లోన్ తీసుకున్న మహేష్ అప్పుల పాలయ్యాడు. ఈఏంఐ పెండింగ్ పడడంతో డబ్బులు చెల్లించాలని ఫైనాన్స్ అధికారుల ఒత్తిడి తట్టుకోలేకపోయారు. ఇల్లు ఫైనాన్స్ తనఖాలో ఉన్నట్లుగా ఇంటిగోడ పై ఫైనాన్స్ సిబ్బంది రాసినారని కలత చెందారు. సోమవారం ఫైనాన్స్ సిబ్బంది ఇంటికి వేలం వేస్తామని అనడంతో భయంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఫైనాన్స్ ఒత్తిడి తేవడంతో మనస్థాపంతో ఉరి వేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మృతుడి భార్య మంజుల పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## - బిసి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్

## ఇది కేవలం పీజుల సమస్య కాదు

## 90% బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థుల భవిష్యత్

## - జిల్లా జెఎసి అధ్యక్షులు మానాల కిషన్





**బుగ్గారం / జగిత్యాల జిల్లా, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 01:** తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ.14 వేల కోట్ల ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మండలోజు రాకేష్ కు జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జె. ఎ .సి. అధ్యక్షులు మానాల కిషన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులు విడుదల కాకపోవడంతో ఫీజులు చెల్లించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తమ చదువులను కొనసాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. మొత్తంగా ఈ సమస్య ఒక కోటి కుటుంబాలపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితిని పేద విద్యార్థులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. పెండింగ్‌లో ఉన్న రూ. 14,000 కోట్ల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. విద్యార్థులు ఎటువంటి ఆటంకం లేకుండా తమ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, అర్జెంట్‌గా ప్రభుత్వం కళాశాలలో చెల్లించే ఫీజులతో నిమిత్తం లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లను కాలేజీ యాజమాన్యం ఆపకుండా వెంటనే ఎవరి సర్టిఫికెట్లు వారికి ఇచ్చేలా ఒక జీవో ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దూడ పోషరాజు, రాజు, విష్ణు, వెంకటేష్, చరణ్, శివ, దివాకర్, ఆర్యన్, రాజు, ఉపేందర్, రాజేందర్, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ అద్భుతం ఎత్తైన కొండలు చీల్చుకుంటూ ముందుకు గోదారమ్మ పరుగులు

**ఎన్నో అద్భుతాలకు నిలయంగా**

**పోలవరం ఎడమ కాలువ నిర్మాణం**

**కనుచూపు మేర కాంక్రీట్ నిర్మాణంతో**

**కనువిందు చేస్తూ ప్రవాహం**



మధ్యలో భారీ అక్విడెక్టులు, వంతెనలను నిర్మించిన అధికారులు

కనువిందు చేస్తూ గలగలా సాగే నీటి ప్రవాహం కనుచూపు మేర కాంక్రీట్‌తో నిర్మాణం. అక్కడక్కడా నడుముకు వడ్డాణంలా కనిపించే భారీ అక్విడెక్టులు, వంతెనలు. ఎత్తైన కొండలను చీల్చుకుంటూ వెళ్లే గోదావరి. ఇదీ అద్భుతంగా సాగిన పోలవరం ఎడమ కాలువ నిర్మాణ తీరు. నిజంగా ఇదంతా ఓ ఇంజినీరింగ్ అద్భుతమేనని చెప్పాలి. ఆ కాలువ ద్వారానే గొంతెండిన గ్రామాల దప్పిక తీర్చుతూ బీడు వారిన భూములను బంగారంగా మార్చుతూ ఉత్తరాంధ్ర వైపు గోదారమ్మ పరుగులు తీస్తోంది. గోదావరి పురుషోత్తపట్నం గ్రామంలో ప్రారంభించిన ఆ పరుగు పిల్ల కాలువగా మారే వరకు దారి వెంట జరిగే అద్భుత దృశ్యాలను చూసొద్దాం పదండి.ఉత్తరాంధ్రాను ఆదుకున్న గోదావరి : ఎక్కడో మహారాష్ట్రలో పుట్టి ఎన్నో వేలమైళ్లు ప్రవహించి ఉద్ధృతమై, ఉగ్రరూపమై దిగువకు వచ్చిన గోదావరి పోలవరం ప్రాజెక్టు వద్దకు రాగానే కాస్త శాంతిస్తుంది. సమీపంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల వద్దకు వచ్చాక నడక మార్చుకుంటుంది. మోటార్ల ధాటికి వచ్చిన ఒత్తిడితో ఉవ్వెత్తున ఎగిసి పడుతూ దిశ మార్చుకుని గలగలా ప్రవహిస్తూ, పోలవరం ఎడమ కాలువలోకి చేరి దిగువకు పరుగులు పెడుతోంది. గొంతెండిన గ్రామాల దాహం తీర్చుతూ బీడు వారిని పొలాలను సస్యశ్యామలం చేస్తూ ముందుకు నడుస్తుంది. దారి పొడవునా రైతన్నను ఆశీర్వదిస్తూ కొండంత భరోసా ఇస్తూ కనువిందుగా ముందుకు కదులుతోంది.లిఫ్ట్ ఇరిగేషన్‌తో కాలువలేకి నీళ్లు పోలవరం ఎడమ కాలువను అద్భుతమైన నిర్మాణశైలితో నిర్మించారు. కాంక్రీట్ కవచంతో కాలువ గట్లను పటిష్టం చేసి చుక్క నీరు వృథా కాకుండా డిజైన్ చేశారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ద్వారా త్రీడీ హైడ్రాలిక్ నమూనాలతో హెడ్ రెగ్యులేటర్ కెపాసిటీని ముందే లెక్కించారు. కాలువ అలైన్‌మెంట్ కోసం అధునాతన జీఐఎస్ , డ్రోన్ సర్వేలను వాడారు. పురుషోత్తపట్నం, పుష్కర వంటి భారీ లిఫ్ట్ ఇరిగేషన్ పంపులతో నది నీటిని కాలువలోకి ఎక్కించే పంపింగ్ టెక్నాలజీని అమోఘం అని చెప్పాలి. చాలా చోట్ల నదులు అడ్డంగా రాగా నీటి ప్రవాహం కోసం నిర్మించిన భారీ అక్విడెక్టులను ప్రత్యేకతగా చెప్పుకోవాలి. కత్తిపూడి నుంచి తుని వెళ్లే మార్గంలో నాలుగు భారీ అక్విడెక్టల నిర్మాణం ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది.అనేక సవాళ్లను ఎదుర్కొన్న గోదారమ్మ కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువ నిర్మాణ మార్గంలో భాగంగా కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ వద్ద 123 మీటర్లు, 115 మీటర్ల ఎత్తున్న రెండు భారీకొండలను తొలిచి కాలువ తవ్వడం ఇంజినీరింగ్ అద్భుతమని చెప్పాలి. సుదీర్ఘ ప్రయాణంలో వందలాది చిన్న, పెద్ద వాగులు, నదులు, రోడ్లు, రైల్వే లైన్లను దాటడానికి అనేక అక్విడెక్టులు, అండర్ టన్నెల్స్ నిర్మించారు. పురుషోత్తపట్నం నుంచి పోలవరం ఎడమ కాలువలో కలిసిన గోదావరమ్మ సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని గ్రామాల మీదుగా ముందుకు వడివడిగా కదులుతుంది. మురారి వద్ద కాకినాడ జిల్లాలో ప్రవేశిస్తుంది. 23 టీఎమ్‌సీ నీటిని తరలించడమే లక్ష్యంగా ఈ భారీ కాలువను నిర్మించారు. దారిలో పలు జాతీయ రహదారులు, నదులు, కాలువలు, రైల్వే ట్రాక్ లు , ప్రవాహాలు అడ్డురాగా పలు భారీ వంతెనలను నిర్మించారు.విశాఖ వాసుల దాహార్తిని తీర్చుతున్న గోదావరి : కాకినాడ జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో బీడువారిన పలు నియోజకవర్గాల మీదుగా ప్రవహించే పోలవరం ఎడమ కాలువ ఏకంగా లక్షా 67 వేల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేస్తోంది. గండేపల్లి మీదుగా ముందుకు సాగుతూ జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని, కాకినాడ రూరల్ నియోజకవర్గాల మీదుగా ప్రహిస్తోంది. శంఖవరం, గొల్లప్రోలు, ఏలేశ్వరం మీదుగా ముందుకు కదులుతోంది. మధ్య మధ్యలో తూముల ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేశారు. రామవరం,తాళ్లూరులో భారీ ఎత్తిపోతల లిఫ్ట్ స్కీంలు నిర్మించి నీటిని పంపింగ్ చేస్తూ వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేయనుంది. గోదావరి జలాలను విశాఖ వైపు నడిపించే ఈ కాలువ, ఎండిన భూములకు ప్రాణం పోసే ఒక అమృతధారగా కనిపిస్తోంది. ప్రగతికి సాక్ష్యంగా నిలుస్తూ విశాఖ వాసుల దాహార్తిని తీర్చేందుకు ఉత్తరాంధ్ర వైపు అడుగులు వేస్తూ నవశకాన్ని నిర్మిస్తోంది.

# హైదరాబాద్ విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి హైవే విస్తరణలో ముందడుగు

**క్లియరెన్స్ ఇచ్చిన పీపీపీఏసీ**

**ఇక కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ**

**ఆమోదమే తరువాయి**

**మూడు ప్యాకేజీలుగా 284 కి.మీ. విస్తరణ**

**అంచనా వ్యయం రూ.12 వేల కోట్లు**

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65)ని ఆరు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు కీలకమైన ఆమోదం లభించింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సమర్పించిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిన తర్వాత ఈ ప్రాజెక్టుకు అధికారికంగా అనుమతి లభిస్తుంది. ఈ ఆమోదం సెప్టెంబర్‌లో లభించే అవకాశం ఉందని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు పేర్కొంటున్నాయి.

**284 కి.మీ దూరం, మూడు ప్యాకేజీలు :**

హైదరాబాద్ శివార్లలోని మల్కాపూర్ నుంచి విజయవాడలోని గొల్లపూడి బైపాస్ వరకు ఉన్న 226 కి.మీ మార్గాన్ని నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లకు విస్తరిస్తారు.ఈ పనులు రెండు ప్యాకేజీలలో జరుగుతాయి: ఒకటి హైదరాబాద్ నుంచి నందిగామ వరకు, మరొకటి నందిగామ నుంచి గొల్లపూడి వద్ద ఉన్న విజయవాడ బైపాస్ వరకు. ఈ విస్తరణ పనులు 'బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్' విధానంలో చేపట్టారు.విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు రహదారి విస్తరణలో భాగంగా, కనూరు సిద్ధార్థ కళాశాల నుంచి దావులూరు టోల్ ప్లాజా దాటి అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ను కలిసే ప్రాంతం వరకు ఉన్న 14 కి.మీ మార్గంలో, ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్లకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు.ఔటర్ రింగ్ రోడ్ క్రాసింగ్ పాయింట్ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న 44 కి.మీ మార్గాన్ని ఆరు లేన్లకు విస్తరిస్తారు. ఈ ప్రాజెక్టు 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' కింద ఒకే ప్యాకేజీగా అమలు చేస్తారు.రూ.12,000 కోట్ల ప్రాజెక్టుకు పీపీపీఏసీ ఆమోదం: హైదరాబాద్-విజయవాడ మధ్య 226 కి.మీ, విజయవాడ-మచిలీపట్నం మధ్య 58 కి.మీ కలిపి మొత్తం 284 కి.మీ విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించి, ఆగస్టు 8న పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశం జరిగింది. గతంలో లేవనెత్తిన అభ్యంతరాలపై చీనా× అందించిన వివరణలను కమిటీ పరిశీలించి, ఆ తర్వాత ప్రాజెక్టుకు కొత్తగా ఆమోదం తెలిపింది. భూసేకరణ, నిర్మాణ వ్యయాలతో కలిపి అంచనా వేసిన రూ. 12,000 కోట్ల వ్యయానికి ఆమోదం లభించిందని సమాచారం. ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు 'ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ' కి సమర్పిస్తారు. భారీ ప్రాజెక్టులకు తుది ఆమోదం తెలిపే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. ఆమోదం లభించిన తర్వాత, భూసేకరణ, టెండర్ల ఆహ్వానం (ప్యాకేజీల వారీగా) ప్రక్రియలు ప్రారంభమవుతాయి.భవానీపురం దాటి విస్తరణ: మొదట్లో, హైదరాబాద్-విజయవాడ హైవేను అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో కలిసే కంచికచర్ల (198 కి.మీ దూరం) వరకు మాత్రమే విస్తరించాలనే ప్రతిపాదన ఉండేది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ రాస్తూ, విస్తరణను కంచికచర్ల వద్ద ఆపకుండా విజయవాడ బైపాస్‌తో కలిసే గొల్లపూడి వరకు పొడిగించాలని కోరారు. తత్ఫలితంగా విజయవాడ బైపాస్ వరకు 226 కి.మీ విస్తరణ కోసం 'వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక' రూపొందిస్తారు. గొల్లపూడి నుంచి భవానీపురం మీదుగా వెళ్లే హైవే విభాగం ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ట్రాఫిక్



రద్దీని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజాప్రతినిధులు దీని విస్తరణను కోరారు. దీనివల్ల, గొల్లపూడిలోని విజయవాడ బైపాస్ నుంచి భవానీపురంలోని కనకదుర్గ ఫ్లైఓవర్ వరకు ఉన్న 5 కి.మీ మార్గాన్ని ఆరు లేన్లుగా విస్తరించాలనే ప్రతిపాదన వచ్చింది. దీనితో మొత్తం విస్తరణ 231 కి.మీకి చేరేది. అయితే చివరి 5 కి.మీ మార్గానికి పీపీపీఏసీ ఆమోదం తెలపలేదు. హైదరాబాద్ నుంచి విజయవాడ బైపాస్ (గొల్లపూడి) వరకు 226 కి.మీ విస్తరణకు మాత్రమే ఆమోదం లభించింది.ఎలివేటెడ్ బ్రిడ్జ్ ప్రతిపాదన విరమణ: విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు హైవే విస్తరణలో భాగంగా, బెంజ్ సర్కిల్ నుంచి ఇడుపుగల్లు జంక్షన్ వరకు ఎలివేటెడ్ ఆరు లేన్ల కారిడార్‌ను నిర్మించాలనే ప్రతిపాదన ఉండేది. కానీ పీపీపీఏసీ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపలేదు. కనూరు నుంచి దావులూరు టోల్ ప్లాజా దాటి ఔటర్ రింగ్ రోడ్‌ను దాటే పాయింట్ వరకు హైవే నాలుగు లేన్లుగానే కొనసాగుతుంది. అయితే ఇరువైపులా కొత్త సర్వీస్ రోడ్లు నిర్మించారు. ఓఆర్ఆర్ క్రాసింగ్ పాయింట్ నుంచి మచిలీపట్నం వరకు హైవేను ఆరు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు మాత్రమే పీపీపీఏసీ ఆమోదం తెలిపింది.

# ఆర్మీ కంచుకోట మద్రాస్ రెజిమెంట్‌లో చోరీ 12 ఆయుధాలను ఎత్తుకెళ్లిన దుండగులు

**4 ఏకే-47లు, ఆరు పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్,**

**మందుగుండు సామగ్రి మాయం**

**దుండగులు గది లోపలికి ఎలా వచ్చారనే ప్రశ్నలు**

**సిబ్బందే చోరీకి పాల్పడి ఉండొచ్చన్న అనుమానాలు**



హైదరాబాద్ కంటోన్మెంట్‌లోని అత్యంత కట్టుదిట్టమైన ఆర్మీ స్థావరంలో ఆయుధాల చోరీ కలకలం రేపుతోంది. బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాలు భద్రపరిచే గది తాళం పగులగొట్టి 12 ఆయుధాలను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన అందరినీ షాక్‌కు గురి చేసింది. 4 ఏకే-47లు, 6 పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్‌తో పాటు మందుగుండు సామగ్రి చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసిన మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.హైదరాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో డిఫెన్స్‌కు చెందిన 12 రకాల ఆయుధాలు చోరీకి గురైనట్లు ఆర్మీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంటోన్మెంట్‌లో ఆర్మీ శిక్షణ సంస్థతో పాటు వివిధ రెజిమెంట్లు కొనసాగుతున్నాయి. వాటిలో మద్రాస్ రెజిమెంట్ కూడా ఒకటి. ఈ రెజిమెంట్‌లో ఆర్మీ సిబ్బంది ఆయుధాలను భద్రపరిచే ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఉంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే దానిలోకి అనుమతి ఉన్న వ్యక్తులు మినహా ఇతరులు ఎవరూ ప్రవేశించేందుకు అవకాశం ఉండదు.రెజిమెంట్ చుట్టూ 4 గేట్లతో కట్టుదిట్టమైన జవాన్ల భద్రత ఉంటుంది. ఆర్మీ అధికారులు, జవాన్లు, అనుమతి ఉన్న వ్యక్తులు తప్ప లోపలికి ఎవర్నీ పంపడానికి అవకాశం లేదు. అయితే ఆదివారం రాత్రి ఆయుధాలు భద్రపరిచే గదిలో చోరీ జరిగినట్లు ఆర్మీ అధికారులు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు తుపాకులు భద్రపరిచే గది తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి 4 ఏకే-47 తుపాకులు, ఆరు పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్‌తో పాటు మందుగుండు సామగ్రిని తీసుకెళ్లినట్లు తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.15 లక్షల వరకు ఉంటుందని చెబుతున్నారు.సిబ్బందిలోనే దుండగులు మరోవైపు ఆయుధాల చోరీకి గురైన మద్రాస్ రెజిమెంట్ చుట్టూ అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న నేపథ్యంలో బయట వ్యక్తులు ఎలా లోపలికి వచ్చారని ఆర్మీ అధికారులు ప్రశ్నలు వేసుకుంటున్నారు. సిబ్బందిలోనే ఎవరైనా ఈ చోరీకి పాల్పడి ఉండొచ్చన్న కోణంలోనూ వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రెజిమెంట్‌లోని సిబ్బందిని అంతర్గతంగా విచారణ చేస్తూ ఆయుధాల భద్రత, తాళాల నిర్వహణ, ఆ సమయంలో డ్యూటీలో ఉన్న సిబ్బంది వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే గదిలో ఉన్న 12 ఆయుధాలను ఒక్క వ్యక్తి తీసుకెళ్లడం సాధ్యం కానే కాదు. ఈ దొంగతనంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పాల్గొని ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అత్యంత భద్రత ఉండే ప్రాంతంలోని ఆయుధాలు భద్రపరిచే గది వరకు చేరుకున్న వ్యక్తులకు రెజిమెంట్‌లోని భద్రతా వ్యవస్థపై పూర్తి అవగాహన ఉండే అవకాశం ఉందన్న కోణంలోనూ కేసును పరిశీలిస్తున్నారు.సున్నిత అంశం - పోలీసుల గోప్యం మద్రాస్ రెజిమెంట్ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండటంతో ఆర్మీ అధికారులు సోమవారం ఉదయం అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రక్షణ వ్యవహారాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశం కావడంతో ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. ఘటన అనంతరం మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీసు ఉన్నతాధికారులు మద్రాస్ రెజిమెంట్‌లోని ఘటనా స్థలిని పూర్తిగా పరిశీలించారు. సమీపంలోని సీసీ ఫుటేజీని తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, చోరీ జరిగిన సమయం, రెజిమెంట్‌లోకి వచ్చి, బయటకు వెళ్లిన వారి వివరాలపై ఆరా తీస్తున్నారు.

# 'క్యూర్'లో లాటరీ ప్రక్రియ ముగిసింది ఇల్లు దక్కింది ఎంతమందికో తెలుసా

**క్యూర్‌లో తొలివిడత ఎల్ఐజీ లాటరీ**

**ప్రక్రియ పూర్తి**

**డ్రా ద్వారా 7,340 మంది ఎంపిక**

**క్షేత్రస్థాయి విచారణ, పరిశీలన**

**అనంతరం ఫ్లాట్లు కేటాయింపు**

**పలు ప్రాంతాల్లో ఎల్లుండితో**

**ముగియనున్న గడువు**



హైదరాబాద్ క్యూర్ పరిధిలో తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తయింది. ఇందిరమ్మ టవర్లలో ఫ్లాట్ల కోసం డ్రా ద్వారా 7,340 మందిని ఎంపిక చేశారు. క్షేత్రస్థాయి విచారణ, ఆధారాల పరిశీలన తర్వాతే ఫ్లాట్లు కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు స్పష్టం చేసింది. ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, గోషామహల్ నియోజకవర్గాల్లో దరఖాస్తుల గడువు ఈ నెల 3న ముగియనుంది. అర్హులను గుర్తించి ఇళ్ల కేటాయింపు హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అల్పాదాయ వర్గాలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల ఫ్లాట్ల కేటాయింపులో కీలక ప్రక్రియ ముగిసింది. క్యూర్ పరిధిలో లాటరీ ద్వారా 7,340 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. తొలి విడతగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న 16 అసెంబ్లీ నియోజవర్గాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఖైరతాబాద్, నాంపల్లి, శేరిలింగంపల్లి, అంబర్‌పేట, బహదూర్‌పురా, ఇబ్రహీంపట్నం, కార్వాన్, మలక్‌పేట, మల్కాజిగిరి, మేడ్చల్, రాజేంద్రనగర్, సనత్‌నగర్, కంటోన్మెంట్, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి 60,720 దరఖాస్తులు వచ్చాయి. అందులో 40,900 మంది మాత్రమే అర్హులు ఉన్నట్లు పరిశీలనలో తేలింది. వీరిలో లాటరీ ద్వారా 7,340 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.వెబ్‌సైట్లో ఎంపికైన వారి వివరాలు లాటరీలో పేరు వచ్చినా సరే క్షేత్రస్థాయి విచారణ, ఆధారాల పరిశీలన తర్వాతే ఫ్లాట్లు కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వీసీ వీపీ గౌతమ్ వెల్లడించారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఎవరైనా అనర్హులు ఎంపికైనట్లు తెలిస్తే ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు తెలపవచ్చునని సూచించారు. అర్హులకు మాత్రమే ఇళ్లు దక్కాలన్న లక్ష్యంతో బహుళ స్థాయి తనిఖీ విధానం అనుసరిస్తున్నట్లు స్పష్టం చేశారు. కొందరు తమ నివాస నియోజకవర్గానికి బదులుగా పొరపాటున వేరే నియోజకవర్గాన్ని ఎంపిక చేశారని, అలాంటి దర ఖాస్తు దారులు ఆ న్లైన్‌లో సరి చేసుకోవాలని తెలిపారు. లాటరీలో ఎంపిక కాని వారు నిరుత్సా హపడొద్దని, రాబోయే ప్రాజెక్టుల్లో మళ్లీ అవకాశం ఉంటుందని గౌతమ్ వెల్లడిం చారు ."ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే నాకు కొత్త రేషన్ కార్డు వచ్చింది. ఈరోజు ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రాలో కూడా నా పేరు రావడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" - ఇందిరమ్మ ఇంటికి ఎంపికైన మహిళ.మరో 5 నియోజకవర్గాల్లో నోటిఫికేషన్లకు కసరత్తులు ఇందిరమ్మ ఫ్లాట్ల లాటరీలో ఇళ్లు వచ్చిన లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఏళ్లుగా ఎదురు చూస్తున్న తమ సొంతింటి కల నెరవేరబోతోందని కొందరు భావోద్వేగానికి లోనయ్యారు. ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, గోషామహల్ నియోజకవర్గాల్లో దరఖాస్తు గడువు ఈ నెల 3తో ముగియనుంది. మరో 5 నియోజకవర్గాల్లో కూడా అనువైన స్థలాలను గుర్తించి, దశల వారీగా నోటిఫికేషన్లు జారీ చేసేందుకు హౌసింగ్ బోర్డు కసరత్తు చేస్తోంది."గత ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఎన్నోసార్లు ఇంటి కోసం దరఖాస్తు చేస్తున్నాను. కానీ ఎప్పుడూ మంజూరు కాలేదు. నాకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది" - ఇందిరమ్మ ఇంటికి ఎంపికైన మహిళ

# ప్రభుత్వ కార్యక్రమంలో కనిపించని మంత్రి కొండా సురేఖ ఫొటో, పేరు

**మంత్రివర్గం నుంచి కొండా సురేఖ తొలగింపు ప్రచారానికి బలం**

**కేసముద్రంలో ప్రభుత్వ కార్యక్రమంలో సురేఖ ఫొటో, పేరు తొలగింపు**

**ఫ్లెక్సీలో ప్రతిపక్ష నేతల ఫొటోలు.. సొంత మంత్రికి దక్కని చోటు**

**కార్యక్రమానికి మంత్రి సురేఖ హాజరు కాకపోవడంపై చర్చ**

**రాజకీయ వర్గాల్లో తీవ్రంగా మారిన ఊహాగానాలు**



రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు జరగనున్నాయని, మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తప్పిస్తారని వస్తున్న ఊహాగానాలకు బలం చేకూర్చేలా ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. సొంత ఉమ్మడి జిల్లా పరిధిలోనే జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఆమె ఫొటో, పేరు లేకపోవడం రాజకీయంగా కలకలం రేపింది. ఈ ఘటన కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే, మునిసిపాలిటీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. అయితే ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.ఈ ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఫొటోలు ఉన్నాయి. ఆశ్చర్యకరంగా, బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఫొటోలను కూడా ముద్రించారు. కానీ, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ ఫొటోకు మాత్రం చోటు కల్పించలేదు. అంతేకాకుండా, శంకుస్థాపన శిలాఫలకంపై కూడా ఆమె పేరును చేర్చకపోవడం గమనార్హం.మరోవైపు, ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ గైర్హాజరు కావడం కూడా చర్చనీయాంశమైంది. తనను మంత్రివర్గం నుంచి తొలగిస్తారనే ప్రచారం జరుగుతున్న తరుణంలోనే, సొంత జిల్లాలో ప్రోటోకాల్ పాటించకపోవడం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్.. ఫ్యూచర్ సిటీకి ప్రపంచ స్థాయి వర్సిటీల క్యూ

**ఫలించిన తెలంగాణ ప్రభుత్వ యూకే, యూఎస్ పర్యటనలు**

**హైదరాబాద్‌లో నార్త్‌ఈస్టర్న్, లండన్ యూనివర్సిటీల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు**

**ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో హార్వర్డ్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కోర్సులు**

**త్వరలో హైదరాబాద్‌కు రానున్న విదేశీ నిపుణుల బృందాలు**




రాజధాని హైదరాబాద్‌ను భారతదేశంలోనే అతిపెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల యూకే, అమెరికా పర్యటనల్లో సాధించిన పురోగతిపై ఉన్నతస్థాయి కమిటీ సోమవారం సీఎంకు నివేదిక సమర్పించింది. ఈ పర్యటనల ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక ఒప్పందాలు కుదిరినట్లు కమిటీ వెల్లడించింది.అమెరికాకు చెందిన నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లండన్ భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయి. ముఖ్యంగా, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ తన క్యాంపస్‌ను 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రభుత్వ, కార్పొరేట్ అధికారుల కోసం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను ప్రారంభించేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ కూడా అంగీకరించింది. ఈ కోర్సులు వచ్చే నవంబర్ నుంచే ప్రారంభం కానున్నాయి.సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆగస్టు 19 నుంచి 29 వరకు యూకే, యూఎస్‌లలో పర్యటించి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఎంఐటీ వంటి దిగ్గజ సంస్థలతో చర్చలు జరిపింది. ఈ చర్చల ఫలితంగా, ఆయా సంస్థల ప్రతినిధుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ఇక్కడి వసతులను పరిశీలించనున్నాయి. ఐటీ, ఫార్మా రంగాల్లో ఇప్పటికే ప్రత్యేక ముద్ర వేసిన హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, నైపుణ్య కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# భర్త బలవంతపు మతమార్పిడి.. కాకినాడ ఎస్పీ ఆఫీస్ వద్దే తిరిగి హిందూ మతంలోకి వచ్చిన భార్య

**భర్త తనను బలవంతంగా మతం మార్చి వేధించాడని మహిళ ఆరోపణ**

**ప్రేమ వివాహం తర్వాత వేధింపులు తీవ్రమయ్యాయని భార్య ఆవేదన**

**మరో ఐదారుగురు మహిళలనూ మతం మార్చాడని ఫిర్యాదు**

**భర్త గౌస్ మొహిద్దీన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



ప్రేమ పేరుతో తనను మోసం చేసి, బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చి, తన భర్త తీవ్ర వేధింపులకు గురిచేశాడని ఓ మహిళ కన్నీటిపర్యంతమై ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయ ఆవరణలోనే ఆమె తన తల్లితో బొట్టు పెట్టించుకుని, తిరిగి హిందూ మతంలోకి వస్తున్నట్లు ప్రకటించడం కలకలం సృష్టించింది.వివరాల్లోకి వెళితే.. కాకినాడ జగన్నాథపురానికి చెందిన సిరిపూరి బాలరమ్య, డిగ్రీ చదువుతున్న రోజుల్లో మటన్ షాపు నడిపే గౌస్ మొహిద్దీన్‌తో ప్రేమలో పడింది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం తల్లిదండ్రులను ఎదిరించి ఆమె అతడిని వివాహం చేసుకుంది. అయితే, వివాహమైన రెండు నెలలకే వేధింపులు ప్రారంభమయ్యాయని, తనను బలవంతంగా ఇస్లాంలోకి మతమార్పిడి చేసి షేక్ ఉమల్ ఖైర్‌గా పేరు మార్చాడని ఆమె వాపోయింది.తమకు కుమార్తె జన్మించిన తర్వాత వేధింపులు మితిమీరాయని, తన సమక్షంలోనే మరో ఐదారుగురు హిందూ యువతులతో సహజీవనం చేస్తూ, వారిని కూడా మతం మార్చాడని ఆమె ఆరోపించారు. దీనిపై నిలదీస్తే.. తనకు ఏడుగురిని వివాహం చేసుకునే అధికారం ఉందని చెబుతూ, కత్తులతో బెదిరించి దాడి చేసేవాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన సోదరిని కూడా వేధిస్తానని అతడు బెదిరింపులకు పాల్పడినట్లు ఆమె పేర్కొన్నారు.గతంలో ఓ యువతిని కత్తితో గాయపరిచిన కేసులో గౌస్ మొహిద్దీన్‌పై రౌడీషీట్ నమోదైందని, ప్రస్తుతం ఒక ఎస్సీ మహిళను వేధించిన కేసులో అతడు రిమాండ్‌లో ఉన్నాడని బాలరమ్య తెలిపారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్‌తో కలిసి జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసిన ఆమె, తనకు రక్షణ కల్పించి భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి బలవంతపు మతమార్పిడులపై సమగ్ర విచారణ జరిపించాలని ఈ సందర్భంగా రామ్‌కుమార్ డిమాండ్ చేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com